రయ్యిరయ్యిమంటూ..
అభివృద్ధిలో దూసుకెళ్తూ..


సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, కార్పొరేటర్ రాజ్యలక్ష్మీ

మౌలాలి: వినాయక్‌నగర్ డివిజన్ పరిధిలోని అంబేడ్కర్‌నగర్, శివనగర్‌లో రూ.90 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మీతో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అందించడమే ధ్యేయంగా పనిచేస్తోందన్నారు. డీఈ లౌక్య, ఏఈ సత్యలక్ష్మీ, పిట్ల శ్రీనివాస్, జీఎస్‌వీ సతీష్‌కుమార్, గుండా నిరంజన్, ఉపేందర్‌రెడ్డి, ఫరీద్, ప్రభాకర్‌రెడ్డి, బాలకృష్ణగుప్తా, సంతోష్ రాందాస్, భాస్కర్, పిట్ల నాగరాజు, లత, చంద్రకాంత్, అరుంధతి, కాలనీవాసులు అంజయ్య, మల్లిఖార్జున, తిరుమలదేవి, అనసూయ, చారి, రాంచందర్, సత్యనారాయణ, శ్రీనివాస్‌గుప్తా, వెంకటేశ్వర్లు, కృష్ణారెడ్డి, అండాలు, హలీమా పాల్గొన్నారు.

నేనున్నానని.. అండగా ఉంటానని..


పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, కార్పొరేటర్ రాజ్యలక్ష్మీ

లాల్వానినగర్‌కు చెందిన వివాన్ ఇటీవల బండ చెరువులో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మీ గురువారం వివాన్ తల్లిదండ్రులను పరామర్శించారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు.

బ్యాంక్ కాలనీలో..

మల్కాజిగిరి: ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ బ్యాంక్ కాలనీలో రూ.23 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. డీఈ లౌక్య, ఏఈ శ్రీకాంత్, వివి రజనీకాంత్, సత్యమూర్తి, జీఎస్వీ సతీష్‌కుమార్, పిట్ల శ్రీనివాస్, నిరంజన్ ఉన్నారు.

అలంకార ప్రియ గోవిందా



మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్‌లోని లక్ష్మీ వేంకటేశ్వర దేవస్థానంలో ధనుర్మాస పూజలు వైభవంగా సాగుతున్నాయి. శ్రీనివాసుడిని డ్రైఫ్రూట్స్‌తో అలంకరించారు. స్వామి వారి రూపాన్ని వివిధ రకాల పండ్లతో తీర్చిదిద్దారు. ప్రధాన అర్చకులు ముడుంబై వెంకటరమణాచార్యులు, అర్చకులు తులసి రమణాచార్యులు, ఈవో రవీందర్‌రెడ్డి, క్లర్క్ సుధాకర్ ఉన్నారు.

అభివృద్ధికి సహకరిస్తా


మేయర్‌ను సత్కరిస్తూ..

ఉప్పల్: చిలుకానగర్ డివిజన్ అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని నగర మేయర్ గద్వాల విజయలక్ష్మీ అన్నారు. చిలుకానగర్ మోడ్రన్ శ్మశాన వాటిక నిర్మాణానికి గురువారం రూ.3 కోట్ల నిధులు మంజూరు చేస్తూ స్టాండింగ్ కమిటీ కౌన్సిల్‌లో ఆమోదించినందుకు హర్షం వ్యక్తం చేశారు. డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ మేయర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్ఎస్ నేతలు కొండల్‌రెడ్డి, జగన్, శ్యామ్, బాలు, సుభద్ర, సరిత ఉన్నారు.

కరెంటు ఉండని ప్రాంతాలు

మల్లాపూర్: మల్లాపూర్ సబ్ స్టేషన్-2(నోమా) ఆరు ఫీడర్ల పరిధిలో శుక్రవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కరెంటు సరఫరా నిలిపివేస్తున్నట్లు మల్లాపూర్ విద్యుత్ ఏఈ క్రిష్టయ్య తెలిపారు. మల్లాపూర్ సెక్షన్ లక్ష్మీనగర్, నర్సింహనగర్, ఏపీ కాలనీ, అశోక్‌నగర్ కాలనీ, సూర్యనగర్ కాలనీ, కృష్ణానగర్, ఎన్టీఆర్‌నగర్, మీర్‌పేట్, శాంతినగర్, అన్నపూర్ణకాలనీ, మైస్ల వర్ పార్క్, శివహోటల్ తదితర ప్రాంతాల్లో కరెంటు ఉండదన్నారు.

జోరుగా అభివృద్ధి పనులు


సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి, కార్పొరేటర్ రజిత

ఉప్పల్: న్యూవిజయపురి కాలనీలో రూ.35 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు స్థానిక కార్పొరేటర్ రజిత పరమేశ్వర్‌రెడ్డితో కలిసి ఉప్పల్ ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కాలనీలో ఇప్పటికే భూగర్భ డ్రైనేజీ పనులు పూర్తి చేశామన్నారు. దశల వారీగా కాలనీలోని సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. న్యూవిజయపురి కాలనీ అధ్యక్షుడు పెద్దోళ్ల నాగిరెడ్డి, మోహన్‌రెడ్డి, దేవిరెడ్డి, శివనారాయణ, యాదగిరి, నల్ల ప్రభాకర్ పాల్గొన్నారు.

నిర్లక్ష్యం తగదు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి

హబ్సిగూడ: హబ్సిగూడలో విద్యుత్ విభాగం అధికారులతో ఉప్పల్ ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యుత్ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలన్నారు. అనంతరం విద్యుత్ అధికారులు ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. విద్యుత్ ఎలక్ట్రికల్ డీఈ సాయిప్రసాద్, ఏడీఈలు బాలకృష్ణ, దశరథ, ఏఈలు శ్రీనివాస్, రాములు, రాంరెడ్డి, నాయకులు జనుంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, గడ్డం రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నయనం ప్రధానం.. సేవలు విస్తృతం


వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న నందికంటి శ్రీధర్

అల్వాల్: నందికంటి శ్రావణ్‌కుమార్ ఫౌండేషన్ సేవలు విస్తృతం చేస్తామని ఫౌండేషన్ చైర్మన్ నందికంటి శ్రీధర్ అన్నారు. వెంకటాపురం డివిజన్ పరిధిలోని ఇందిరా మహిళా భవన్‌లో ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. శిబిరాన్ని ప్రారంభించిన శ్రీధర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ నందికంటి శ్రావణ్ కుమార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి అద్దాలు పంపిణీ చేస్తున్నామని, అవసరమైన వారికి ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలు చేయిస్తున్నట్లు తెలిపారు.

పెండింగ్ పనులను సకాలంలో పూర్తి చేయండి


రోడ్డు చదును పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి

మల్లాపూర్: పెండింగ్ పనులను సకాలంలో పూర్తిచేయాలని మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి అధికారులకు సూచించారు. మల్లాపూర్ డివిజన్ పరిధిలోని గ్రీన్ హీల్స్ కాలనీలో సీసీరోడ్డు కోసం వేయనున్న రోడ్డు చదును చేసే పనులను అధికారులతో కలిసి కార్పొరేటర్ గురువారం పరిశీలించారు. మల్లాపూర్ ఏఈ స్రవంతి, వర్క్‌ఇన్‌స్పెక్టర్లు భిక్షపతి, రామారావు, స్థానిక నేతలు నెమలి రవికుమార్, పీఆర్.ప్రవీణ్, దేవిరెడ్డి రంగారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, అల్తాఫ్, ఇస్మాయిల్, కీర్తి శ్రీకాంత్, మోసిన్, రాపోలు శ్రీనువాస్ తదితరులు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు


ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా ఎన్నికైన సముద్రాల వేణుగోపాలచారికి శుభాకాంక్షలు తెలుపుతున్న సీనియర్ నాయకుడు గరిక సుధాకర్.

అభినందనలు



కుషాయిగూడ: స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆంజనేయగౌడ్‌కు మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

సన్మానం..



కాప్రా: రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన ఈడిగ ఆంజనేయులుగౌడ్‌ను బీఆర్ఎస్ ట్రస్ట్ చైర్మన్, బీఆర్ఎస్ ఉప్పల్ నియోజకవర్గ సీనియర్ నాయకులు బండారి లక్ష్మారెడ్డి సన్మానించారు. మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, కాసం మహిపాల్‌రెడ్డి, మహేష్‌గౌడ్, కుమారస్వామి, వెంకటహరి, దుర్గ, రమాదేవి, జంపాల్‌రెడ్డి, పవన్, స్వామి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి అర్చక ప్రవేశ పరీక్షలు

కుషాయిగూడ: కుషాయిగూడలోని పద్మావతి వెంకటేశ్వరస్వామి ఆలయంలోని కళ్యాణమండపంలో నేటి నుంచి జిల్లాస్థాయి పరీక్షలు ప్రారంభమవుతాయని దేవదాయశాఖ నోడల్ ఆఫీసర్ అన్నపూర్ణ తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాస్థాయితో 201 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. వారు ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్లు పొందాలని సూచించారు. శుక్రవారం ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు మొదటి పేపరు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండో పేపర్ ఉంటుందని తెలిపారు. అభ్యర్థులకు భోజన వసతి ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

సైబర్ క్రైం.. బీకేర్ ఫుల్..



అల్వాల్: సైబర్ నేరాల పట్ల అప్రమతంగా ఉండాలని నేరేడ్‌మెట్ పోలీసులు అన్నారు. నేరేడ్‌మెట్ దీన్‌దక్‌నగర్‌లోని పాషా పబ్లిక్ స్కూల్‌లో సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఎలా ఉండాలి అనే అంశంపై అవగాహన కల్పించారు. ఓఎల్ఎక్స్‌లో మోసాలు, ఇన్‌స్టంట్ లోన్ యాప్స్, వివిధ రకాల లింకులు, స్కిన్ సేరింగ్ యాప్స్ తదితర వాటిపై అప్రమత్తంగా ఎలా ఉండాలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

ఒత్తిడిని చిత్తు చేసేందుకే క్రీడలు

● సాంకేతిక విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ పుల్లయ్య


క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న రాష్ట్ర సాంకేతిక విద్యా శాఖ జాయింట్ డైరెక్టర్ పుల్లయ్య

రామంతాపూర్: విద్యార్థులు చదువుతో పాటు వివిధ క్రీడల్లో శిక్షణ పొంది జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో పాల్గొనాలని రాష్ట్ర సాంకేతిక విద్యా శాఖ జాయింట్ డైరెక్టర్ పుల్లయ్య అన్నారు. రామంతాపూర్ జేఎన్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని 13 పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు గురువారం నిర్వహించిన జిల్లాస్థాయి క్రీడాపోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాంకేతిక విద్య అభ్యసిస్తున్న విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికాకుండా క్రీడల్లో పాల్గొనే విధంగా ప్రతి సంవత్సరం రాష్ట్రస్థాయి, జిల్లాస్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పాలిటెక్నిక్ కళాశాలలో క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం 37 ఫిజికల్ డైరెక్టర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర టెక్నికల్ ఎడ్యుకేషన్ బోర్డు డైరెక్టర్ శ్రీనాథ్, రామంతాపూర్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ ఏ.వినయ్‌కుమార్, రేణుకారెడ్డి, డాక్టర్ సురేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రూ.25 లక్షలతో బాక్స్ డ్రైన్


పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సునీత

మౌలాలి: కృష్ణానగర్‌లో రూ.25 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న బాక్స్ డ్రైన్ పనులను గురువారం కార్పొరేటర్ గున్నాల సునీతశేఖర్‌యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మౌలాలి డివిజన్ పరిధిలోని ఆర్టీసీ కాలనీ, హనుమాన్‌నగర్, కృష్ణానగర్, శివానందనగర్ వాసులకు ముంపు సమస్య ఉండదన్నారు. ఏఈ మహేందర్, అజీమ్, సాయిబాబు, మహేష్, సలీమ్, షబార్, వాజిత్, రమణ, వెంకటేష్, శ్రీను, మేరీ తదితరులు ఉన్నారు.

భోజనం.. అధ్వానం..


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రవణ్‌కుమార్

మల్కాజిగిరి: విద్యార్థులకు పెడుతున్న మధ్యాహ్న భోజనం అధ్వానంగా ఉందని మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ అన్నారు. మల్కాజిగిరి ఉన్నత, ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని గురువారం పరిశీలించారు. వంటరూమ్ బాగాలేదన్నారు. వండిన భోజనం, కూరల్లో నాణ్యత లేకపోవడంపై ప్రధానోపాధ్యాయులు వీరేశం, విల్సన్‌ను ప్రశ్నించారు. స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ సైదమ్మతో పాటు తల్లిదండ్రులతో కార్పొరేటర్ సమావేశమయ్యారు. నాణ్యత పెంచాలని ఆయన సూచించారు.

ప్రాణాలు తీస్తున్న నిర్లక్ష్యం


సర్కిల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మల్కాజిగిరి: మల్కాజిగిరి మండల పరిధిలోని నాలాలు, చెరువులకు పూర్తిస్థాయిలో కంచె ఏర్పాటు చేయాలని మల్కాజిగిరి కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. కాంగ్రెస్ పార్టీ బి బ్లాక్ కమిటీ ఆధ్వర్యంలో మల్కాజిగిరి సర్కిల్ ఏఎంసీకి గురువారం వినతి పత్రం అందజేశారు. గతంలో నాలాలో పడి విద్యార్థిని, ఇటీవల చెరువు వద్ద కంచె తొలగించడంతో మూగబాలుడు ప్రాణాలు కోల్పోయారన్నారు. అధికారుల వైఫల్యంతోనే ఈ రెండు ఘటనలు జరిగాయని ఆరోపించారు. కార్యాలయం వద్ద కొద్దిసేపు ధర్నా చేశారు. శ్రీనివాస్‌గౌడ్, రాంచందర్, వెంకటేష్‌యాదవ్, పోల్కం వెంకటేష్, వినోద్‌యాదవ్, ఉమేష్‌సింగ్, సానాది శంకర్, ఆశ ఉన్నారు.

రోడ్డు కబ్జా పట్టదా..?


నిరసన వ్యక్తం చేస్తున్న కాలనీవాసులు

మల్లాపూర్: నాచారం డివిజన్ పరిధిలోని గోల్లముత్యాలు కాలనీలో అన్నపూర్ణ కాలనీకి వెళ్లే రోడ్డు కబ్జా గురవుతోందని, కబ్జా నుంచి కాపాడాలని అన్నపూర్ణ కాలనీవాసులు అస్రూ, సమద్ కోరారు. గురువారం స్థలం వద్ద నిరసన తెలిపారు. పాత లేవుట్‌లో స్పష్టంగా రోడ్డు ఉన్నా.. ప్రస్తుత లేవుట్‌లో రోడ్డు లేదని ప్రహరీ నిర్మించడం ఏమిటని ప్రశ్నించారు. టౌన్‌ప్లానింగ్ అధికారులు పనులను నిలిపేసినా.. మళ్లీ పనులు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాప్రా డీసీ, టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు.

ఘన సన్మానం

కుషాయిగూడ: సావిత్రిబాయిపూలే అవార్డు అందుకున్న చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవిని గురువారం చర్లపల్లి డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ నేతలు, కాలనీ సంక్షేమ సంఘాలు, వివిధ అనుబంధ సంఘాల ప్రతినిధులు ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విశిష్టమైన సావిత్రిబాయిపూలే అవార్డుకు తనను ఎంపిక చేయడం సంతోషంగా ఉందన్నారు. బీఆర్ఎస్ నాయకులు నాగిళ్ల బాల్‌రెడ్డి, బొడిగె ప్రభుగౌడ్, బత్తుల శ్రీకాంత్‌యాదవ్, రాజుగౌడ్, నరసింహ వంశరాజ్, హరినాథ్, విజయ్‌కుమార్, శ్రీనివాస్, రామకృష్ణ, గోపి, పాండు, శంకర్, సదానంద్, మురళిగౌడ్, చిట్టిబాబు రాజు, ప్రసాద్, రాములు పాల్గొన్నారు.



రైళ్లకు హాల్టింగ్ కల్పించాలి



మల్కాజిగిరి: మల్కాజిగిరి రైల్వేస్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ సదుపాయం కల్పించాలని మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ దక్షిణ మధ్య రైల్వే జీఎం కార్యదర్శి శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం అందజేశారు. అజంతా, ఇతర ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ సదుపాయం కల్పించాలని, మల్కాజిగిరి స్టేషన్‌లో సీనియర్ సిటిజన్స్ కోసం లిఫ్ట్ ఏర్పాటు చేయాలన్నారు.

యువకుడి ఆత్మహత్య

కుషాయిగూడ: ఒంటరిగా జీవిస్తూ మద్యానికి బానిసైన ఓ యువకుడు మనస్థాపంతో ఆత్మహత్యకు పాల్పడి మృతిచెందిన ఘటన గురువారం కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో వెలుగుచూసింది. ఎస్ఐ ఉపేందర్‌యాదవ్ వివరాల ప్రకారం.. చక్రిపురం కాలనీకి చెందిన ఉరుమల్ల జయపాల్‌రెడ్డి (35) లేబర్. భార్యతో విడాకులు తీసుకొని, 2020లో మరో మహిళను వివాహం చేసుకున్నాడు. ఆమె కూడా వదిలేసి వెళ్లిపోవడంతో మద్యానికి బానిసై బుధవారం రాత్రి ఉరి వేసుకుని మృతి చెందాడు. తండ్రి సోమిరెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నాణ్యత పాటించండి


మల్లికార్జుననగర్‌లో..

గౌతంనగర్: అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. మల్లికార్జుననగర్‌లో రూ.59 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ మేకల సునీత యాదవ్‌తో కలిసి గురువారం ప్రారంభించారు.

యోగాతో ఆరోగ్యం


ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డికి ఆహ్వానపత్రం అందజేస్తూ..

రామంతాపూర్: ప్రతిరోజూ యోగా చేస్తే ఎంతో ఆరోగ్యమని ఉప్పల్ ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి అన్నారు. 8వ తేదీన నిర్వహించే చైతన్య యోగా కేంద్రం పదో వార్షికోత్సవానికి హాజరు కావాలంటూ యోగా కేంద్రం డైరెక్టర్ బొడ్డు రవీందర్ గురువారం ఆహ్వానపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతిరోజూ యోగా చేస్తే ఎంతో ఆరోగ్యం అన్నారు. యోగా కేంద్రం సభ్యులు నర్సింహ, రమేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులే.. గంజాయి విక్రేతలు

ఉప్పల్: గంజాయి విక్రయిస్తున్న ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ గోవింద్‌రెడ్డి వివరాల ప్రకారం.. విజయవాడకు చెందిన రేకపల్లి సుమంత్(20) విద్యార్థి. పటాన్‌చెరువు మండలం ఇస్నాపూర్‌లో నివాసం ఉంటున్నాడు. నిజామాబాద్ ప్రాంతానికి చెందిన రాథోడ్ సాయికిరణ్(21) విద్యార్థి. ఘట్‌కేసర్‌లోని ఓ హాస్టల్‌లో ఉంటున్నాడు. మల్కాజిగిరి హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన మేడిచలిపి నీరజ్(20) విద్యార్థి. వీరు గంజాయి సేవించడంతో పాటు విక్రయిస్తూ జులాయిగా తిరుగుతున్నారు. బుధవారం వారిని అదుపులోకి తీసుకుని 400 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకొని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సెల్‌ఫోన్లు, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.